# అట్టహాసం

**ఎకౌంటెంట్ గారితో** మాట్లాడుతున్న సారధి దగ్గరకెళ్ళి సుబ్రహ్మణ్యం-

" ఇందులో ఓ సంతకం పడేయండి బిల్లు మీ టేబులుమీద ఉంది గానీ " అన్నాడు.

నిజానికి రికార్డు కీపరు సుబ్రహ్మణ్యం చెప్పింది పూర్తిగా వినిపించుకోకపోయినా, ఓ సంతకం గిలికి మళ్ళీ తీవ్ర చర్చలలో మునిగి పోయాడు సారధి.

విషయం సీరియస్‌గా ఉంది. ఒక్కొక్క క్లర్కు మూడువందలు నేమ్సు ఆడిట్ చెయ్యాలా, మూడువందల యాభయి చెయ్యాలా? ఎన్ని చేస్తే ఆడిట్ క్వాలిటీ ఉంటుంది? అసలు ఎన్ని నేమ్సు ఆడిట్ ఖచ్చితంగా చెయ్యగలడో గుమస్తా? ఇంతవరకు ఈ బిల్ ఆడిట్‌కి నారమ్సు ఎందుకు నిర్ణయించలేదు? గుమస్తా అంటే గొడ్డుచాకిరీ చెయ్యాలా? ఏమైనా తప్పుటొప్పులు వస్తే అంతా హాయిగా తప్పుకుంటారు. చిరుద్యోగులమైన మామీద పెడతారు అంటూ వాదోపవాదాలు, ఆర్గ్యుమెంట్‌లు, అభియోగాలు జరుగుతున్నాయి ఎకౌంటెంట్ గారి సీటుదగ్గర నిజంగా అది గుమస్తాలకీ, సూపర్‌వైజర్‌లకి మధ్య జరుగుతున్న మర్యాదయిన యుద్ధం.

పనితనంలో నేర్పు సంపాదించడంవల్ల గానీ, తెలివితేటలవల్ల గానీ ఎవ్వరికీ ప్రమోషన్లు రావు. తమకిందవారు కాలుకి, మెడకి వాదాలు

వేస్తూ మొరాయిస్తూ, మొండికేస్తే, వాళ్ళకి లొంగకుండా తనూ అంతకి రెండింతలు మొండిచెయ్యగల శక్తిని సంపాదించుకుంటే అదే ప్రమోషన్‌కి అర్హత.

అందుకే ఎకౌంటెంట్‌గారు ఖచ్చితంగా చెప్పారు. "ప్రతి గుమాస్తా మూడొందల యాభయి నెంబర్లు ఆడిట్ చేసి, ఇరవై తొమ్మిదో తారీఖునాటికి నా టేబులుమీద పెట్టాల్సిందే" అని.

విసుగ్గా వచ్చి తన సీట్లో కూర్చున్నాడు సారధి. ప్రసాదు నెమ్మదిగా వచ్చి "సారూ, మీరు హీటెక్కిపోయినట్లున్నారు. ఈ అందమైన బొమ్మ చూడండి హాయిగా ఉంటుంది" అంటూనే ఆఫీస్‌బోయ్ రావడం వల్ల బెల్లు వినిపించినవైపు పరుగు పెట్టాడు. నిజంగా ఆ బొమ్మకేసి చూడంగానే మండుటెండలోంచి ఏ. సి. రూంలోకి వచ్చినట్లనిపించింది సారధికి. మధ్యకి మడచిన న్యూస్‌పేపర్‌మీద నిలువెత్తున నిలబడిన అందాలతార శ్రీదేవి బొమ్మ అది. ఎంత అందంగా వయ్యారంగా ఉందనీ అది. చిన్న నిక్కరు, బనీను వేసుకొని ఎత్తుమడమల జోళ్ళు, చేతిలో రంగుల పువ్వుల గొడుగు,—కళ్ళలో చిలిపితనం, కవ్వించే అదతనం, కనురెప్పలు వేయనీయని కమనీయమైన చిప్పురుటాకులాంటి చిరు పెదవులు....సారధి ఆదమరచి చూస్తూనే వున్నాడు. మూర్తీభవించిన సౌందర్యదేవత అని పదే పదే అనుకుంటున్నాడు. తదేకంగా చూస్తున్నాడు. అంతా ఎవరి హడావుడిలో వారున్నారు. ఎవరూ తనని పట్టించుకోకపోయినా అతనికి తనివితీరలేదు. ఆ బొమ్మవంక ఇంకా ఎంతసేపైనా చూస్తూవుండాలనే వుంది. అయిష్టంగా ఆ పేపరు తీసి డ్రాయరు సొరుగులలో వేసి—అన్యమనస్కంగా పని మొదలుపెట్టాడు....

మూడురోజులు ముమ్మరంగా జరిగే సేలరీబిల్ ఆడిట్ సారధి ఈసారి కసిగా చేశాడు. ఎల్. పి. సి. రాలేదని కొందరి జీతాలు కోశాడు. మస్తరులలో తప్పులున్నాయని కత్తిరింపులు చేసాడు. ఆఫీసరు సంతకాలు

అన్నిచోట్లా లేవనీ-అవనీ ఇవనీ ఆరు కాగితాల అబ్జక్షన్సు రిపోర్టు తయారుచేశాడు. అది ఆఖరిరోజు. వచ్చిన బిల్లులన్నీ లెక్కచూసి పంపాల్సినరోజు. సారధి చేస్తున్న డిపో మేనేజర్‌గారి బిల్లు ఎక్కడా కనిపించలేదు. కనపడుటలేదనే వార్త దావానలంలాగా ఆఫీసంతా వ్యాపించింది-ఫ్యూళ్లు వెదకటం మొదలుపెట్టారు. కొంతమంది గుమస్తాలు కూడా సానుభూతితో తమ సీట్లు వెదికి వారిదగ్గర లేదని ఖాయం చేశారు.

సారధికి వొళ్ళు మండిపోయింది. అన్ని బిల్సుతో కలిసి నాకా బిల్లురాలేదని ఢంకామీద దెబ్బకొట్టి చెప్పాడు-ఎకౌంటెంట్‌గారు "వెదకండి వెదకండి" అంటూ....బంగారు మామిడిపండుకోసం మహారాజుగారు తన పరివారాన్ని నాలుగు వైపులకీ పంపినట్లు, అందర్నీ ఆదేశించారు. చివరిగా సారధి అసలు నా కా బిల్లు డాక్‌లోంచి రాలేదన్నాడు. అన్న అరక్షణంలో సుబ్రహ్మణ్యంగారు డాక్ రిజిష్టర్ తెచ్చి సారధి సంతకం చూపించారు. సారధికేం చెయ్యాలో పాలుపోలేదు. బిల్లు తీసుకుని పోగొట్టినందుకు— ముందు మెమొ, తర్వాత ఛార్జిషీటు—అలా—అలా ఏమైనా జరగచ్చు. మనసంతా చికాకుగా అయిపోయింది. అంత దెబ్బలాడిన ఎకౌంటెంట్ గారి దగ్గరకెళ్ళి " సార్, ఓసారి డిపోకి ఫోను చేస్తాను " అన్నాడు.

ఆయన అవకాశాన్ని జారవిడుచుకోకుండా "ఏమయ్యా ! జాగ్రత్త వుండాలి. నువ్వు తీసుకున్నావు. మరెక్కడ పెట్టావు ? డిపోకి ఫోనుచేసి ఏం చెప్తావు ? " అన్నారు.

" డూప్లికేట్ పంపమని చెప్తాను సార్ " అన్నాడు తలొంచుకుని. సారధిలాంటి చాకులాంటి కుర్రాడలా ఓడిపోవడం ఎకౌంటెంట్‌కి కూడా ఏమి బాగాలేదు. " సరే కానీయండి " అన్నారు. మిట్టమధ్యాహ్నం ఎండలో చెమటలు కక్కుతూ డిపో గుమస్తా పరుగెట్టుకొచ్చాడు. "ఏంటి గురూ ! మా డి. ఎమ్. చండశాసనుడు డూప్లికేటుమీద సంతకమంటే

నానా గొడవానూ—అయినా ఎలా పోయింది గురూ ” అన్నాడు ఆయాసంగా—సారథి ముఖం నల్లగా మాడిపోయింది.

“ ఆయనే వుంటే అరటాకెందుకని సామెత; ఎలా పోయిందో తెలిస్తే బాధేముంది ” అన్నాడు.

“అదేంటి గురూ ! నిలువెత్తున నిలబడిన శ్రీదేవి బొమ్మున్న పేపరు అట్ట వేశాను గురూ. ” అన్నాడు. సారథి ఉలిక్కిపడ్డాడు. చటుక్కున డ్రాయరు సొరుగు లాగాడు. సిగలోలికె కళ్ళతో చిలిపిగా నవ్వుతున్న శ్రీదేవి—బయటికి తీసి చూశాడు. లోపల ఒక్క పేజీ బిల్లు డి. ఎమ్. గారి ఒక్కరికోసం ప్రత్యేకంగా వేసిన బిల్లు. అటూ ఇటూ దట్టమైన రెండేసి కాగితాల అట్టలు. ఈ మూడు రోజుల్లో ఆ బొమ్మని కనీసం మూడొందలసార్లు చూశాడు తను.

ఆ బొమ్మను వెనక్కి మడిచి లోపలి డి. ఎమ్. గారి బిల్లు ఆడిట్ చేస్తుంటే సారథిలో దుఃఖంలోంచి నవ్వు వికటాట్టహాసం చేసింది.